

ఉమేష్ చంద్రను స్ఫూర్తిగా తీసుకోవాలి : ఎస్‌పి

ప్రజాశక్తి- కడప అర్బన్ : ఉమేష్ చంద్ర క్రమశిక్షణ, నిబద్ధత, అంకితభావం, నిజాయితీని స్ఫూర్తిగా తీసుకుని పోలీస్ సిబ్బంది విధులు నిర్వర్తించాలని ఎస్‌పి వి.హర్షవర్ధన్ రాజు పేర్కొన్నారు. బుధవారం ఉమేష్ చంద్ర వర్ధంతి సందర్భంగా చిత్రపటానికి పోలీసులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ ఉమేష్ చంద్ర 1966, మార్చి 29 న గుంటూరు జిల్లా పెదపూడిలో జన్మించారని తెలిపారు. డిగ్రీ, పోస్ట్ గ్రాడ్యుయేట్ లలో గోల్డ్ మెడల్ అందుకుని, 1991లో ఐపిఎస్‌కు ఎంపికయ్యారన్నారు. కడప జిల్లాలో 1994లో ఎఎస్‌పిగా, 1995లో ఎస్.పిగా విధులు నిర్వర్తించి ప్రజల మన్ననలు పొందా రన్నారు. 'జన జాగృతి' పేరుతో ప్రజలతో మమేకమై ఫ్రెండ్లీ పోలీ సింగ్‌ను అమ లుచేసి పోలీస్ శాఖను ప్రజలకు మరింత చేరువ చేయడంలో ఆద్యుడు ఉమేష్ చంద్ర అని పేర్కొన్నారు. ఉమేశ్ చంద్ర సెప్టెంబరు 4, 1999, సెప్టెంబర్ 4 న మరణిం చారని భౌతికంగా లేకపోయినా ఆయన ఆశయాల సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

విభజన హామీలు అమలు చేయాలి

- సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మనోహర్

ప్రజాశక్తి- జమ్మలమడుగు రూరల్

విభజన చట్టంలో ఉన్న అంశాలను అమలు చేసి రాష్ట్ర ప్రజలకు ఉపాధి కల్పించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బెల్లం మనోహర్ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక సిఎస్ఐ క్యాంబెల్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పదేళ్ల కిందట విభజన చట్టంలో కడప జిల్లా ఉక్కు పరిశ్రమ నిర్మాణానికి అనువైన స్థలమని చెప్పి ఇంతవరకు అమలు కాలేదన్నారు. స్థానిక ప్రజా ప్రతినిధులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉక్కు పరిశ్రమ నిర్మాణం కోసం ఒత్తిడి తీసుకురావాలన్నారు. మాజీ ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి బతికి ఉన్నప్పుడు ఉక్కు పరిశ్రమకు శంకుస్థాపన చేశారని, ఆయన మరణానంతరం అది మరుగున పడిందన్నారు. చంద్రబాబు నాయుడు కంబాలదిన్నెలో, జగన్ మోహన్‌రెడ్డి సున్నపురాళ్లపల్లెలో శంకుస్థాపన చేసి చేతులు దులుపు కున్నారు. ప్రస్తుత ముఖ్యమంత్రి ఉక్కు పరిశ్రమపై స్పష్టమైన ప్రకటన చేయాలన్నారు. గండికోటను పర్యాటకంగా అభివృద్ధి చేయాలని కోరారు. నియోజ వర్గంలో సిమెంటు పరిశ్రమలు ఎక్కువగా వచ్చేందుకు అవకాశం ఉందన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మనోహర్

రాజోలి బాధితులకు పరిహారం అందించి న్యాయం చేయాలని కోరారు. పేదరికంలో ఉన్న ప్రజలకు ఉపాధి కల్పించే ఏకైక మార్గం పరిశ్రమల నిర్మాణమేనని స్పష్టం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి ఏసుదాసు, సిఐటియు పట్టణ కార్యదర్శి దాసరి విజయ్, నాయకులు వినయ్, కుమార్ పాల్గొన్నారు.

ఇంక్రిమెంట్ల కోత ఉత్తర్వులను రద్దు చేయాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల విధులకు హాజరు కాలేదనే కారణంగా జిల్లాలోని నలుగురు ప్రధానోపాధ్యాయులకు విధించిన ఇంక్రిమెంట్ల కోత ఉత్తర్వులను రద్దు చేయాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయకుమార్, పాలెం మహేష్ బాబు విజ్ఞప్తి చేశారు. బుధవారం కడపలోని పాఠశాల విద్య, ప్రాంతీయ సంయుక్త సంచాలకుల కార్యాలయంలో ఆర్జేడి కె.శామ్యూల్‌ను కలిసి ఇంక్రిమెంట్ల రద్దు ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలని కోరుతూ వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మాదన విజయకుమార్, పాలెం మహేష్ బాబు మాట్లాడుతూ ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల విధులకు హాజరు కాలేదని కారణంగా ఖాజీపేట మండలం, సి.కొత్తపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సి.గాయత్రి భాయి, పెండ్లిమర్రి మండలం గంగనపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సి.సావిత్రిదేవి, పులివెందుల రమణప్ప సత్రం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్.చంద్రశేఖరరావు, వేంపల్లి జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వి.నారాయణమ్మకు రెండు ఇంక్రిమెంట్లు శాశ్వతంగా రద్దు చేస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారని తెలిపారు. ఇంక్రిమెంట్ల కోతకు గురైన ప్రధానోపాధ్యాయులు అనారోగ్య కారణంగా విధులకు హాజరు కాలేకపోయారే తప్ప విధుల పట్ల నిర్లక్ష్యం ఎంత మాత్రం కాదన్నారు. అధికారులు మానవతా దృక్పథంతో స్పందించి నలుగురు ప్రధానోపాధ్యాయులకు ఇంక్రిమెంట్లో కోత విధిస్తూ జారీచేసిన ఉత్తర్వులను రద్దు చేయాలని కోరారు. అలాగే ఇంగ్లీషు ఉపాధ్యాయుడు డేవిడ్‌కు నిలుపుదల చేసిన ఇంక్రిమెంట్లను సైతం పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జిల్లా సహాధ్యక్షుడు వై.రవి కుమార్ పాల్గొన్నారు.

గురువులను గౌరవించడం అందరి బాధ్యత : విసి

ప్రజాశక్తి - కడప అర్బన్



కార్యక్రమంలో మాట్లాడుతున్న విసి కృష్ణారెడ్డి

గురువులను గౌరవించడం అందరి బాధ్యత అని వైవీయూ విసి కృష్ణారెడ్డి అన్నారు. బుధవారం మానస ఇన్‌లో ఇంటాక్, లైన్స్ క్లబ్ ఆఫ్ కడప అన్నమయ్య సంయుక్త ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. ముందుగా సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యతోనే ఉన్నత శిఖరాలు అధిరోహించడం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. గురువు చెప్పింది శ్రద్ధగా విన్నవారు ఉన్నత స్థానాలకు చేరుకుంటారని తెలిపారు. వైవీయూ పరీక్షల నియంత్రణ అధికారి ఈశ్వర్ రెడ్డి మాట్లాడుతూ ప్రాథమిక స్థాయి నుంచి విద్యార్థులపై ఒత్తిడి తేవడం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. తల్లిదండ్రులు పిల్లలను సన్మార్గంలో పయనించేలా చూడాలని చెప్పారు. ఇరిగేషన్ ఎస్ఇ కమతం శ్రీనివాసులు మాట్లాడుతూ గురువును గౌరవించిన వారు ప్రతి ఒక్కరిని గౌరవిస్తారని తెలిపారు. జిల్లాలో ఇంజినీర్‌గా గుర్తింపు ఉండే పనులు చేయడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం గురువులను సన్మానించారు. కార్యక్రమంలో మానస చిన్నపరెడ్డి, కొండూరు జనార్ధన రాజు, డాక్టర్ రంగనాథరెడ్డి, బాలకొండ గంగాధర్, ఫర్వతుల్లా, శ్రీనివాసులు, రాజారత్నం ఐజాక్ పాల్గొన్నారు.

నేత్రదానంపై ప్రదర్శన, అవగాహన

ప్రజాశక్తి కడప -సిటీ



ప్రతిజ్ఞ చేస్తున్న ప్రిన్సిపల్, సూపరింటెండెంట్, వైద్యులు

39వ జాతీయ నేత్రదాన పక్షోత్సవాలు సందర్భంగా ప్రభుత్వం జనరల్ హాస్పిటల్, ప్రభుత్వ వైద్య కళా శాలలో కంటి విభాగపు ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. పక్షోత్సవాల సందర్భంగా జి జి హెచ్ సూప రింటెండెంట్ రమాదేవి, జిఎంసి ప్రిన్సిపల్ ఏ. సురేఖ ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. నేత్రదాన ప్రాముఖ్యతను, ప్రజలలో నేత్రదానం మీద ఉన్న అపోహలను నివృత్తి చేయాలని వైద్య కళాశాల విద్యార్థులచే నాటక రూపంలో మహావీర్ కూడలిలో ప్రదర్శించారు. అనంతరం కంటి విభాగం కో- ఆర్డినేటర్ డాక్టర్ వై వెంకటయ్య, వైద్యులు, వైద్య కళాశాల విద్యార్థులు, ప్రజలలో నేత్రదాన ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కంటి విభాగాధిపతి డాక్టర్ ఎం. కిరణ్మయి, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ విజయ భాస్కర్ రెడ్డి, సామాజిక వైద్య విభాగ అధిపతి డాక్టర్ గోపికృష్ణ, డాక్టర్ కస్తూరిబాయి, డాక్టర్ రాంబాబు, డాక్టర్ వెంకటయ్య, కంటి విభాగం సంబంధించిన వైద్యులు, పీజీలు,వైద్య విద్యార్థులు, ఆప్తాలిక్ ఆఫీసర్ చిన్నయ్య, పారా మెడికల్ విద్యార్థులు, పాల్గొన్నారు.

ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలి : ఎస్‌పి

ప్రజాశక్తి-అట్లూరు : పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి త్వరితగతిన పరిష్కరించాలని ఎస్‌పి వి. హర్షవర్ధన్‌రాజు పేర్కొన్నారు. బుధవారం సిద్దవటం, అట్లూరు పోలీస్‌స్టేషన్లను ఆయన అకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్లలోని రికార్డులను పరిశీలించారు. పిర్యాధులపై ఎలాంటి చర్యలు తీసుకోవాలో నిర్దిష్టమైన అవగాహన కల్గి ఉండాలని చెప్పారు. కొత్తగా బాధ్యతలు చేపట్టిన ఎస్ఐలు ఫిర్యాదుదారుల పట్ల మార్యాద పూర్వకంగా వ్యవహరించి వారిచ్చే ఫిర్యాదులను నాణ్యతగా పరిష్కరించాలని సూచించారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట ఎఎస్‌పి జి.వెంకట రాముడు, ఒంటిమిట్ట సిఐ కృష్ణంరాజు నాయక్, సిద్దవటం ఎస్ఐ వెంకట నాగ చిరంజీవి, అట్లూరు ఇన్‌ఛార్జి ఎస్ఐ రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

బిసి భవనాన్ని పరిశీలించిన కలెక్టర్

ప్రజాశక్తి - కడప సిటీ

కడప ఓల్డ్ రిమ్స్‌లో ఉన్న బిసి భవనాన్ని కలెక్టర్ లోతేటి శివశంకర్ బుధవారం పరిశీలించారు. నాయకులకు పలు సూచనలు, సలహాలిచ్చారు. ఆయనతోపాటు బిసి సంక్షేమాధికారి ఎం. భరత్‌కుమార్‌రెడ్డి, బిసి సంఘం జిల్లా అధ్యక్షులు బత్తల లింగమూర్తి, వర్కింగ్ ప్రెసిడెంట్ గోవిందు నాగరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి ములకాని త్రివిక్రమ్ యాదవ్, ట్రెజరర్ ఎం శ్రీనివాసులు, ముఖ్య సలహాదారులు యస్ .ఖాదర్ బాషా, రాష్ట్ర ఉపాధ్యక్షులు నటరాజ్, రాష్ట్ర మహిళా నాయకులు టీ.జయశ్రీ, జిల్లా ఉపాధ్యక్షులు కళ్యా సుధాకర్, పస్తం అంజి, ఆర్ల గంగయ్య పాల్గొన్నారు.

మున్సిపల్ యంత్రాంగం బాధ్యత వహించాలి

ప్రజాశక్తి- కడప అర్బన్



నాయకులతో మాట్లాడుతున్న అడిషనల్ కమిషనర్

పారిశుధ్య కార్మికులకు తెల్లవారుజామున 3 గంటలకు జమాల్‌పల్లి ఎన్‌టిపిసి పరిధిలో చెత్త తరలించే వాహనం కంపెక్టర్ ప్రమాదానికి గురైందని, దీనికి కార్పొరేషన్ యంత్రాంగం బాధ్యత వహించాలని సిఐటియు నగర అధ్యక్షులు చంద్రారెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాదంలో నలుగురు మున్సిపల్ కార్మికులు తీవ్ర గాయపడ్డారని పేర్కొన్నారు. తెల్లవారుజామున 3.40 గంటలకు సమాచారం అందుకున్న సిఐటియు యూనియన్ నాయకులు క్షతగాత్రులను రిమ్స్‌కు తరలించారని చెప్పారు. వాహనాలు పూర్తి స్థాయిలో ఫిట్నెస్‌గా లేవని, ఇన్సూరెన్స్ కూడా లేవని, పైగా అడిషనల్, అర్హత లేని కార్మికులను డ్రైవర్స్‌గా నైపుణ్యంలేని వారిని వాడుకుంటున్నారని పేర్కొన్నారు మెరుగైన చికిత్స కోసం రూ.10 లక్షలు పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. పూర్తిగా కోలుకునే వరకు వారి కుటుంబాలను ఆదుకోవాలని పేర్కొన్నారు. రిమ్స్ వద్ద కార్మికులను అడిషనల్ కమిషనర్, ఎంహెచ్ఒ పరామర్శించారు. ధర్నా కార్యక్రమం వద్దకు వచ్చి క్షతగాత్రులకు మరింత మెరుగైన చికిత్స కోసం ప్రవేటు హాస్పిటల్‌లో చేర్పి స్తామని హామీ ఇచ్చారు. మెరుగైన చికిత్స కొరకు ఇద్దరు కార్మికులను తిరుపతిలోని రమాదేవి హాస్పిటల్‌కు తరలించారు. కార్యక్రమంలో సుంకర రవి, తిరుపాల్, శ్రీరామ్, ప్రకాష్, కిరణ్, గోపి, విజయ్, నాగరాజు, వెంకటేష్, శ్రీధర్, బాలాజీ, మస్తాన్ పాల్గొన్నారు.

పండ్ల తోటల పెంపకానికి ప్రాధాన్యత

ప్రజాశక్తి-ఒంటిమిట్ట : ఉపాధి చట్టం ద్వారా సిసిరోడ్లు, రైతుల పొలాల్లో మొక్కలు, పండ్ల తోటల పెంపకానికి ప్రభుత్వం పెద్దపీట వేసిందని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపిపి అక్కిశెట్టి లక్ష్మీదేవి పేర్కొన్నారు. బుధవారం ఉదయం 10:30 గంటలకు ఒంటిమిట్ట మండల ప్రజా పరిషత్తు భవనంలో ఎంపిపి ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశంలో మొదటగా ఎండిఒ రెడ్డయ్య మాట్లాడుతూ అజెండా ప్రకారం ఆయా శాఖలకు సంబం ధించిన అధికారులు మాట్లాడవలసిందిగా ఆదేశించారు ఈ సందర్భంగా మొట్టమొదటిగా ఉపాధి హామీకి సంబంధించిన ఎపిఓ శంకర్ రెడ్డి మాట్లాడుతూ గత నెల 23న రాష్ట్రవ్యాప్తంగా అన్ని పంచాయతీ గ్రామాల పరిధిలో గ్రామ సభలు నిర్వహించామని చెప్పారు. ప్రతి పంచాయతీలోనూ అభివృద్ధి పనులు ఏవిధంగా చేపట్టాలి అనే దానిపై చర్చించామన్నారు. ఎపిఎం నాగార్జున నాయుడు మాట్లాడుతూ ఎవరైనా కొత్త గ్రూపులు ఏర్పాటు చేసుకుంటే వారికి అన్ని విధాలా సకరిస్తామని చెప్పారు. ఒంటిమిట్ట ప్రాథమిక కేంద్రం వైద్యులు మాట్లాడుతూ వర్షాకాలం ఆరంభం కావడంతో కనుక గ్రామాలలో విష జ్వరాలు ప్రబలుతున్నాయని, జాగ్రత్తగా ఉండాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపిటిసిలు, సర్పంచులు అన్ని శాఖలకు సంబంధించిన అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత స్థానాలకు వెళ్లాలి

ప్రజాశక్తి - కడప అర్బన్



ఫర్వతుల్లాను సన్మానిస్తున్న ఖాదర్‌బాషా

విద్యార్థులు ఉపాధ్యాయుడు దగ్గర క్రమ శిక్షణతో చదివి ఉన్నత స్థానాలకు వెళ్లాలని జనం కోసం సేవా సంస్కృతిక, విద్య, క్రీడా అభివృద్ధి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జెకె ఖాదర్ బాష అన్నారు. ఈనెల 5న ఉపాధ్యా యుల దినోత్సవం సందర్భంగా బుధవారం ఆలంఖాన్‌పల్లిలో ఉన్న జడ్‌పి హెచ్ ఎస్‌లో హిందీ ఉపాధ్యాయులుగా సేవలందిస్తున్న ఫర్వాతుల్లాను ఘనంగా సత్కరించి, జ్ఞాపిక అందజేశారు. ఈ సందర్భంగా ఖాదర్‌బాషా మాట్లా డుతూ 8,9,10 తరగతులలో మొదటి ర్యాంక్ సంపాదించుకున్న విద్యా ర్థులకు తమ వంతుగా బహుమతులు అందజేశామని తెలిపారు. కార్యక్రమంలో కరిముల్లా, నగర ప్రముఖులు చాంద బాష, పిఇటి నిత్యానంద, హెచ్ఎం మునిరత్నమ్మ. ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

సమాజ సేవే 'మానవత' లక్ష్యం

ప్రజాశక్తి- చెన్నూరు : సమాజ సేవ చేయడమే మానవత సంస్థ లక్ష్యమని మండల శాఖ అధ్యక్షులు ఆవుల బసిరెడ్డి , మండల మాజీ అధ్యక్షులు జి.ఎన్.భాస్కర్ రెడ్డి అన్నారు. బుధవారం సమాజ సేవలో భాగంగా శ్మశాన వాటిక వద్ద సభ్యులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్థానిక శ్మశానవాటికలో మరణించిన వారికి కర్మకాండ చేసుకునేందుకు వీలు లేకుండా ఉండేదని అందుకోసం శ్మశాన వాటికలో పిచ్చి చెట్లను తొలగించి కర్మకాండకు చేసుకునేందుకు వీలుగా అని వసతులు కల్పిం చామని అన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి దాని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరి పైన ఉందని వారన్నారు. కార్యక్రమంలో ఆకుల చలపతి, నీలం శ్రీనివాస్ రెడ్డి, ఆటో బాబు పాల్గొన్నారు

వరి పొలాలను పరిశీలించిన జెడిఎ

ప్రజాశక్తి - చింతకొమ్మదిన్నె: మండల పరిధిలోని ఇప్పపెంట గ్రామలో కడప జిల్లా వ్యవసాయ అధికారి డాక్టర్ ఎ. నాగేశ్వరరావు వరి పొలాలను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి పంటలో వచ్చే తెగుళ్ళ, వాటి నివారణపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు, యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు. అనంతరం జీవామృతం తయారీ విధానం, వాటి ఉపయోగాల గురించి వివరించారు. ప్రతి రైతూ ఈ -క్రాప్ చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఈశ్వర్‌రెడ్డి, రైతు సేవా కేంద్రం ఇన్‌ఛార్జి రేఖ, ఎపిసిఎంఎఫ్‌వన్, ఐసిఆర్‌పి సిబ్బంది పాల్గొన్నారు.

ఉర్దూ డిఐ పోస్టులు భర్తీ చేయాలి

ప్రజాశక్తి - కడప అర్బన్ : రాయలసీమ జోన్-4 లోని కడప, కర్నూలు, చిత్తూరు, అనంతపురం జిల్లాలో ఉర్దూ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ ఉర్దూ రేంజ్ పోస్ట్ భర్తీ చేయాలని ఎస్‌టియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఇలియాస్ బాష, సంగమేశ్వర్ రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాల గంగిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఆర్‌జెడి కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎస్‌టియు నాయకులు మాట్లాడుతూ ఉర్దూ డిఐ పోస్టులు కొన్నేళ్లుగా భర్తీ కాక ఉర్దూ పాఠశాలలో పర్యవేక్షణ లోపించిందన్నారు.

సబ్సిడీతో సోలార్ రూఫ్‌టాప్ : కలెక్టర్

ప్రజాశక్తి - కడప

సబ్సిడీతో గృహాలకు ఇంటి పైకప్పు మీద సోలార్ రూఫ్ టాప్ నెలకొల్పడానికి పిఎం సూర్య ఘర్ ముఫ్ట్ బీజలి యోజన కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిందని కలెక్టర్ శివ శంకర్ లోతేటి తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లోని బోర్డు మీటింగ్ హాలులో పథకంపై కలెక్టరు జిల్లా స్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పథకం గృహ వినియోగ దారులకు మాత్రమే వర్తిస్తుందని తెలిపారు. సోలార్ రూఫ్ టాప్ ప్లాంట్ సామర్థ్యం 1 కిలో వాట్‌కు నెలకు 120 యూనిట్ల చొప్పున వినియోగదారునికి ఏడాదికి రూ 8000, 2 కిలో వాట్లకు నెలకు 240 యూనిట్ల చొప్పున వినియోగదారునికి ఏడాదికి రూ.20000, మూడు కిలో వాట్ల కు నెలకు 360 యూనిట్ల చొప్పున వినియోగదారునికి ఏడాదికి రూ.32,400 ఆదా అవుతుందని తెలిపారు. ఒక కిలో వాట్ కింద రూ.30 వేలు, 2 కిలో వాట్స్ కింద రూ.60 వేలు, త్రీ కిలోవాట్స్ కింద రూ. 78వేలు ప్రభుత్వ సబ్సిడీ లభిస్తుందన్నారు. ఇంటి పైకప్పు పైన కనీసం 10 చ. మీ./ 100 చ. అడుగుల స్థలంలో 1 కిలో వాట్ ప్లాంటును ఏర్పాటు చేసుకోవచ్చన్నారు. ఈ పథకానికి సంబంధించి ఒక సంవత్సరంలోపు 50,000 గృహాలకు జిల్లాలో రాయితీ ద్వారా సోలార్ రూఫ్ టాప్ ప్లాంట్లు ఏర్పాటు చేసేందుకు లక్ష్యాన్ని నిర్దేశించి జిల్లా స్థాయి కమిటీ సభ్యులకు, సంబందిత అధికారులకి తగు సూచనలు



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ శివశంకర్ లోతేటి

చేశారు. అనంతరం పిఎం సూర్య ఘర్ ముఫ్ట్ బీజలి యోజన పథక పోస్టర్‌ను సంబంధిత అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ విడుదల చేశారు. సమావేశంలో విద్యుత్ ఎస్ఇ రమణ , నెడ్ క్యాప్ డెవలప్మెంట్ ఆఫీసర్ ఎల్లారెడ్డి, జడ్‌పి సిఇఒ సుధాకర్ రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్, డిఆర్‌డిఎ ప్రాజెక్టు డైరెక్టర్ ఆనంద నాయక్, లీడ్ జిల్లా మేనేజర్ జనార్ధన్, సభ్యులు పాల్గొన్నారు.

ఎస్‌ఒపై చర్యలు తీసుకోవాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - కడప అర్బన్

అట్లూరు మండలం కేంద్రంలోని కస్తూర్బా గాంధీ విద్యాలయంలో విద్యార్థుల కడుపు కొడుతున్న ఎస్ఒ పై చర్యలు తీసుకుని సస్పెండ్ చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష , కార్యదర్శులు ఎద్దు రాహుల్, వీరపోగు రవి డిమాండ్ చేశారు. బుధవారం కడప కలెక్టర్ కార్యాలయంలో డిఆర్ఒ గంగాధర్ గౌడ్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల కేంద్రంలో ఉన్న కస్తూర్బా గాంధీ పాఠశాలలో 285 మంది విద్యార్థినులు చదువుకుంటున్నారని పేర్కొన్నారు. వారికి ప్రభుత్వం మెనూ సక్రమంగా అమలు చేయకుండా అవినీతి, అక్రమాలకు పాల్పడుతూ చాలీ చాలని భోజనం పెడుతూ విద్యార్థులు కడుపు కొడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అటువంటి ఎస్ఒను విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. దొంగ బిల్లులు, రికార్డులు రాసుకుంటూ, పిల్లల కడుపు కొడుతూ డబ్బు సంపాదించుకుంటూంటే జిల్లా అధికారులు చర్యలు తీసుకోవడం వెనక ఉన్న ఆంతర్యం ఏమిటని వారన్నారు. ఇప్పటికైనా జిల్లా నుంచి అధికారులు స్పందించి అక్కడున్నటువంటి కస్తూర్బా గాంధీని పాఠశాలను సందర్శించి ఎస్ఒ పైన కఠిన చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ఆందోళన, పోరాటాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నగర కార్యదర్శి మనోజ్ పాల్గొన్నారు.

విద్యార్థులకు తిథి భోజనం

ప్రజాశక్తి - వల్లూరు

స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో విద్యార్థులకు మధ్యాహ్నం తిథి భోజనం ఏర్పాటు చేశారు. పాఠశాలలో పదో తరగతి చదువుతున్న బి. స్పందన అనే విద్యార్థి పుట్టిన సందర్భంగా బుధవారం తల్లిదండ్రులు సాయిగీత, సతీష్‌కుమార్ విద్యార్థులందరికీ మధ్యాహ్నం తిథి భోజనం ఏర్పాటు చేసినట్లు పాఠశాల ప్రత్యేక అధికారి నసీం మనీషా తెలిపారు. అనంతరం విద్యార్థులకు స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. పాఠశాలలో పుట్టినరోజు జరుపుకుంటున్న స్పందనకు విద్యార్థినులు శుభాకాంక్షలు తెలియజేశారు. విద్యార్థిని తల్లిదండ్రులకు ఉపాధ్యాయులు విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

ఉర్దూ విద్యార్థులకు తీరని అన్యాయం

ప్రజాశక్తి - కడప అర్బన్

జిల్లాలో ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియలో భాగంగా జిల్లా విద్యాశాఖ వారు ఉర్దూ మీడియం ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు ఉర్దూ వర్ణ మాల కూడ రాని తెలుగు మాధ్యమ ఉపాధ్యాయులను ఉర్దూ సబ్జెక్ట్ టీచర్లుగా కేటాయించారని, ఇది ఉర్దూ విద్యార్థులకు తీరని నష్టం కలిగిస్తుందనిరూట జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ముహమ్మద్ ఇర్షాద్, జాకీర్ హుస్సేన్ పేర్కొన్నారు. బుధవారం ఆర్‌జెడికి శ్యామూల్ దృష్టికి పలు సమస్యలు తీసుకెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉర్దూ వర్ణమాల కూడా రాని ఉపాధ్యాయులను ఉర్దూ పాఠశాలలకు సబ్జెక్టుల విద్యాబోధన కోసం కేటాయించడం చేస్తే ఉర్దూ మాధ్యమ విద్యార్థుల విద్యా ప్రమాణాలు అధః పాతాళానికి పడిపోతాయని వాపోయారు. ఇలాంటి అసంబద్ధ సర్దుబాటు చేసి ఉర్దూ విద్యార్థులు జీవితాలతో ఆడుకోవడం అన్యాయమని తెలిపారు. వెంటనే ఆ ఉపాధ్యాయులను వెనక్కి పంపించాలని వారికి బదులుగా అర్హత కలిగిన విద్య వాలంటీర్లను నియమించాలని కోరారు. స్పందించిన ఆర్జెడి శామ్యూల్ ఉర్దూ విద్యార్థులకు, ఉపాధ్యాయులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారన వారు తెలిపారు.

ఉత్తమ ఉపాధ్యాయినిగా పిఇటి ప్రమీల

ప్రజాశక్తి-అట్లూరు



జిల్లా ఉత్తమ ఉపాధ్యాయినిగా అట్లూరు కెజిబివిలో పనిచేస్తున్న పిఇటి ప్రమీల ఎంపికయ్యారు. ఆమె 2012లో పెండ్లిమర్రి కస్తూరిబా పాఠశాలలో విధుల్లో చేశారు. సాఫ్ట్‌బాల్, బేస్ బాల్, జూడో, కబడ్డీ క్రీడల్లో విద్యార్థినులను రాష్ట్ర స్థాయికి శిక్షణ ఇచ్చారు. సుమారు 300 మంది విద్యార్థులను రాష్ట్ర స్థాయి క్రీడాకా రిణులుగా తయారు చేశారు. తాను విద్యార్థి దశ నుంచి ఇప్పటి వరకు జాతీయ క్రీడాకారిణిగా వ్యాయామ ఉపాధ్యాయినిగా రాణించడానికి తన గురువు రమేష్ యాదవ్ కారణమన్నారు. తననుఎంపిక చేసిన జిల్లాలోని సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయులకు, అధికారులకు ఆమె ధన్యవాదాలు తెలియజేశారు.

కేంద్ర కారాగారాన్ని సందర్శించిన జడ్జి

ప్రజాశక్తి - కడప : సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ సెక్రటరీ ఎస్. బాబా ఫక్రుద్దీన్ బుధవారం కడప కేంద్ర కారాగారం, మహిళ కారాగారాన్ని, రాయచోటి సబ్ జైలును సందర్శించారు. ఈ సందర్భంగా ఖైదీలతో మాట్లాడి వారి కేసు వివరాలను, ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు, ఉచిత న్యాయ సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం జైలు పరిసరాలను, వంటగదులను, వసతి గదులను, టాయిలెట్లను, రిజిష్టరల్ల పరిశీలించి తగు సూచనలను సలహాలను ఇచ్చారు. కార్యక్రమంలో కేంద్ర కారాగారం సూపరింటెండెంట్ మహిళా కారాగారపు సూపర్డెంట్, రాయచోటి సబ్ జైల్ సూపరిండెంట్, ఖైదీలు పాల్గొన్నారు. ఈనెల 14న జిల్లా వ్యాప్తంగా నిర్వహించబోయే జాతీయ లోక్ అదాలత్ లో ఎక్కువ సంఖ్యలో కేసులు రాజీమార్గం ద్వారా పరిష్కారం అయ్యేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జడ్జి అన్నారు. బుధవారం లక్కిరెడ్డిపల్లి కోర్టులో ముందస్తు జాతీయ లోక్‌దాలతో సమావేశం నిర్వహించారు. కేసు వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జాతీయ లోక్ అదాలత్ కరపత్రాలు పంచారు. కార్యక్రమంలో చైర్ పర్సన్ కం జూనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయ సేవా సమితి షేక్ పాయి జున్నిస, న్యాయవాదులు, బ్యాంక్ అధికారులు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

జాతీయ విపత్తుగా ప్రకటించాలి : సిపిఎం

ప్రజాశక్తి - కడప అర్బన్



మాట్లాడుతున్న రామమోహన్

వందేళ్ళలో ఎన్నడూ సంభవించని వరద ప్రళయాన్ని జాతీయ విపత్తుగా ప్రకటించాలని, ప్రధాని మోడీ వరద ప్రభావిత ప్రాంతాలలో పర్యటించి ఆంధ్ర, తెలంగాణను ఆదుకో వాలని సిపిఎం జిల్లా కార్య దర్శి వర్గ సభ్యులు ఎ. రామ్మోహన్ కోరారు. బుధవారం సిపిఎం జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు తెలుగు రాష్ట్రాల్లో వరద ప్రళయం లక్షలాది మందిని నిరాశ్రయులను చేసిందని తెలిపారు. మూడు రోజులుగా వరద బాధితులు నీరు, ఆహారం, మందుల కోసం అల్లాడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. భారీ వర్షాలు, వరదల ప్రభావంతో పేదలకు పనులు, తిండి గింజలు లేక, తాగడానికి మంచి నీరు దొరకక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. వరదల్లో నష్టపోయిన పేదలకు వంట చేసుకోవడానికి తక్షణ సహాయంగా 16 రకాల నిత్యాసర వస్తువులు ఉచితంగా పంపిణీ చేయాలని కోరారు. ఖర్చులకు పదివేలు ఇవ్వాలని, మూగజీవాలు కోల్పోయిన పేదలకు రూ.50 వేలు ఇవ్వాలన్నారు. వరద ప్రభావిత ప్రాంతాలలో నష్టపోయిన ఆస్తులకు నష్టపరిహారం, పక్కా ఇల్లు నిర్మించి ఇవ్వాలని చెప్పారు. పంట నష్టపోయిన రైతులకు పరిహారంతో పాటు తిరిగి పంటలు, ఎరువులు వేయడానికి విత్తనాలు, మందులు ఉచితంగా అందించాలని చెప్పారు. వ్యవసాయ ఖర్చులకు కూడా ఇవ్వాలని, పంట రుణాలు రద్దు చేయాలని తెలిపారు. కేంద్రంలో ఎన్‌డిఎలో భాగమైన రాష్ట్ర టిడిపి ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తెచ్చి జాతీయ విపత్తుగా ప్రకటించి అధిక నిధులు రాష్ట్రానికి తీసుకురావాలని కోరారు. సమావేశంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు శ్రీనివాసులు రెడ్డి, దస్తగిరి రెడ్డి పాల్గొన్నారు.

వరదలపై జగన్ విమర్శ విడ్డూరం

ప్రజాశక్తి -కమలాపురం టౌన్

విజయవాడను భారీ వరదల్లో చిక్కుకున్న ప్రజలకు సాయం చేస్తూ అనునిత్యం వారికి ఎలాంటి కష్టం రాకుండా రాత్రి, పగలు తేడా లేకుండా సహాయక చర్యలను పర్యవేక్షిస్తూ పాలు, నీళ్ల, ఆహారాన్ని సిఎం చంద్రబాబునాయుడు దగ్గరుంచి అందిస్తుంటే మాజీ సిఎం జగన్ విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందని టిడిపి సీనియర్ నాయకులు దేవరాజుపల్లి నాగిరెడ్డి, బిసి నాయకులు గండినారాయణ, నియోజకవర్గ నాయకులు గుజ్జుల నారాయణ పేర్కొన్నారు. బుధవారం వారు విలేకర్లతో మాట్లాడుతూ 74 సంవత్సరాల వయసులోనూ చంద్రబాబునాయుడు యువకుడి మాదిరి, నీట మునిగిన కాలనీలలో రాత్రి పగలు అనే తేడా లేకుండా అహర్నిశలు ప్రజల మధ్యనే ఉండి సహాయక చర్యలు పర్యవేక్షిస్తూ వారి కష్టనష్టాలను తెలుసుకుంటున్నారని చెప్పారు. నారా లోకేష్ టెక్నాలజీని ఉపయోగించుకొని బాధిత ప్రాంతాలను పరిశీలిస్తూ ఎప్పటికి అప్పుడు కేంద్ర, రాష్ట్ర మంత్రులంతో మాట్లాడుతూ అధికారులకు సలహాలు, సూచనలిస్తున్నారని చెప్పారు. వైసిపి ప్రభుత్వ హాయంలో వరదలు సంభవించినప్పుడు కేవలం ఏరియల్ సర్వే చేసి ఎలాంటి సాయం చేయలేదని వాపోయారు. ఇకనైనా విమర్శలు మాని చేతనైన వరదబాధితుల కోసం సాయం చేయాలని వ ఆరు హితవు పలికారు. సమావేశంలో జిల్లా రైతు నాయకులు రమణారెడ్డి, మండల రైతు అధ్యక్షులు రవీంద్రారెడ్డి , లేటపల్లి రఘురామిరెడ్డి పాల్గొన్నారు.

యజమానుల పేర్లతో డోర్ నెంబర్లు ఇవ్వండి

- కౌన్సిలర్ మహేశ్వర్‌రెడ్డి వినతి

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పులివెందుల మున్సిపాలిటీలోని 32వ వార్డు బ్రాహ్మణపల్లిలో సుమారు 105 కుటుంబాలు ఉన్నాయని, ఇంటి యజమాని పేరుతో డోర్ నెంబర్లు ఇవ్వాలని కౌన్సిలర్ మహేశ్వర్‌రెడ్డి మున్సిపల్ కమిషనర్ రాముడును కోరారు. ఆ మేరకు మంగళవారం ఆయన మున్సిపల్ కార్యాలయంలో బుధవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ ఏళ్ల గడుస్తున్నా వార్డులోని కొంతమంది గృహ యజమానులకు వారి పేరుతో పన్నులు కానీ, డోర్ నెంబర్లు కానీ లేవని, వీటిపై వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఇందుకు కమిషనర్ స్పందిస్తూ వీటిపై తగిన చర్యలు తీసుకుంటామని కౌన్సిలర్ మహేశ్వర్ రెడ్డికి హామీ ఇచ్చారు.

నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలి

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ సిపిఐ స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద బుధవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎంవి సుబ్బారెడ్డి మాట్లాడుతూ భారతదేశ వ్యాప్తంగా నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శి శరత్, నియోజకవర్గ సహాయ కార్యదర్శి ఎం.నారాయణ, ఎఐఎస్ఎఫ్ నాయకులు ఎస్.మస్తాన్, మండల కార్యవర్గ సభ్యులు బి.ప్రతాప్, ఎస్.ఇమామ్ సాహెబ్, రైతు సంఘం నాయకులు పైని శివప్రసాద్‌రెడ్డి, గంగిరెడ్డి పాల్గొన్నారు.

కొత్త పద్ధతులు, మెలకువలు నేర్పించాలి

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

పంటల సాగులో రైతులకు కొత్త పద్ధతులు, మెలకువలు నేర్పించాలని పులివెందుల వ్యవసాయ డివిజన్ అధికారి ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని ఉలిమెల గ్రామంలో బుధవారం పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ ఎలాంటి పురుగు మందులు, రసాయన ఎరువులు లేకుండా ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో ఘన, ద్రవ జీవామృతాలు, తెగుళ్ల నివారణకు కషాయాలు వాడాలన్నారు. తద్వారా మంచి పంటలు వస్తాయన్నారు. జీవామృతాన్ని ఆకుల పైన ముందే చేసి చూపించారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి నాగలక్ష్మి, ప్రకృతి వ్యవసాయ అధికారి నరసింహారెడ్డి, భాస్కర్ రెడ్డి, రవీంద్ర గౌడ్, శివా, అర్జునరెడ్డి, సుబహనీబీ, రైతులు గోవర్ధన్ రెడ్డి, జగన్మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా నలుగురు ఎంపిక

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని జిల్లా పరిషత్ ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న నలుగురు ఉపాధ్యాయులను జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైనట్లు ఎంఇఒ రవిశంకర్ తెలిపారు. నరహరిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గణిత ఉపాధ్యాయుడు అబ్దుల్ కరీం, అల్లాడుపల్లె ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు ఎస్‌వివి ప్రసాద్ భాను, అనంతపురం ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు ఎస్.అరుణ, కస్తూర్బా పాఠశాల స్పెషల్ ఆఫీసర్ ఎస్.భారతి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారని తెలిపారు. వీరికి గురువారం కడప కలెక్టరేట్‌లో జరిగే సమావేశంలో ప్రశంసాపత్రాలు అందజేస్తారని ఎంఇఒ తెలిపారు. ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన నలుగురు ఉపాధ్యాయులను మండల విద్యాశాఖ తరఫున అభినందించారు.

వినాయక విగ్రహాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి

ప్రజాశక్తి - చాపాడు

వినాయక చవితి సందర్భంగా గ్రామాల్లో వినాయక విగ్రహాలు ఏర్పాటు చేయడానికి కమిటీలు తప్పనిసరిగా పోలీసుల అనుమతి పొందాలని ఎస్ఐ చిన్న పెద్దయ్య తెలిపారు. వినాయక చవితి సందర్భంగా ఎస్ఐ పలు సూచనలు చేశారు. విగ్రహాలు నిలపడానికి వివాదాస్పద స్థలాలు కాకుండా ట్రాఫిక్ అంతరాయం లేని ప్రదేశాలను ఎంచుకోవాలన్నారు. విగ్రహాల నిర్వాహకులు తగిన భద్రత ఏర్పాటు చేసుకోవాలన్నారు. రాత్రింబవళ్లు తప్పనిసరిగా నలుగురికి తక్కువ కాకుండా విగ్రహ రక్షణ నిమిత్తం ఉండాలన్నారు. విగ్రహావిష్కరణ, నిమజ్జనం రోజున ఎలాంటి అశ్లీల కార్యక్రమాలు నిర్వహించకూడదన్నారు. మైక్ ఉపయోగించాలనుకుంటే నిబంధనల కనుగుణంగా అనుమతులు పొందాలన్నారు. నిబంధనలు పాటించని వారి పట్ల కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

హుండీ ఆదాయం రూ.37 లక్షలు

ప్రజాశక్తి - చక్రాయపేట

రాయలసీమలో పేరు ప్రఖ్యాతి చెందిన గండి క్షేత్రంలో భక్తుల కానుకల ద్వారా హుండీ ద్వారా రూ.37,10,681 ఆదాయం వచ్చినట్లు దేవస్థాన సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య తెలిపారు. నగదుతోపాటు రెండు కేజీలు వెండి, 17 గ్రాములు బంగారు హుండీలో కానుకలు వేసినట్లు తెలిపారు. కడప దేవాదాయ సూపర్ ఇండెంట్ రవణమ్మ, ప్రధాన అర్చకులు కేసరి స్వామి, ఉప ప్రధాన అర్చకులు రాజారామ మారెళ్ళ మడక విఠల్, ట్రిబులేటి విద్యార్థులు, చక్రాయపేట ఎపిజివి సిబ్బంది, ఆర్కెవ్యాలీ పోలీస్ సిబ్బంది, దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణాన్ని కాపాడుదాం : సిఐ

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

వినాయక చవితి సందర్భంగా మట్టి గణపతులను ప్రతిష్టించి పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని ప్రొద్దుటూరు టూ టౌన్ సిఐ యుగంధర్ తెలిపారు. డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో జిల్లా కమిటీ ముద్రించిన మట్టి గణపతులను ప్రతిష్టిద్దాం-పర్యావరణాన్ని కాపాడుదాం అనే పోస్టర్లను ఆవిష్కరించారు. ముందుగా ఇలాంటి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్న డివైఎఫ్ఐ యువజన సంఘానికి అభినందనలు తెలిపారు. డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనారాయణకుమార్ మాట్లాడుతూ డివైఎఫ్ఐ యువజన సంఘం పోరాటాలే కాదు ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమాలు కూడా నిర్వహిస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు గుర్రం దేవదేవ్‌రాజ్, ప్రొద్దుటూరు పట్టణ నాయకులు విశ్వనాథ్ పాల్గొన్నారు.

క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలి

ప్రజాశక్తి - వేంపల్లె

విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలని ఆర్‌జెడి, కళాశాల ప్రిన్సిపల్ రవి, డివిఇఒ వెంకటసుబ్బయ్య సూచించారు. స్థానిక ఉర్దూ జూనియర్ కళాశాలలో బుధవారం తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రూ.8 కోట్లతో మంచి ఆహ్లాదకరమైన వాతావరణంలో ఉర్దూ కళాశాలను నూతనంగా అన్ని సౌకర్యాలతో నిర్మించారన్నారు. నూతన కళాశాలలో 9వ తేదీ నుండి విద్యార్థులకు విద్యా బోధన చేయనున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో మాజీ ప్రిన్సిపల్ హబిబుల్లా, మండల ఖాజీ కరీముల్లా, అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రిలో కనీస సౌకర్యాలు కరువు

నేలపైనే కూర్చుంటున్న రోగులు - తాగునీటి కోసం ఇక్కట్లు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్



కుర్చీలు లేక కింద కూర్చున్న రోగులు

పులివెందుల ప్రభుత్వ ఆసుపత్రిలో కనీస వసతులు కరువయ్యాయి. రోగులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. కూర్చోవడానికి కుర్చీలు.. తాగడానికి మంచినీరు కూడా లేదని రోగులు పేర్కొంటున్నారు. సమయానికి వైద్యులు రావడం లేదని.. సిబ్బంది సరిగా స్పందించడం లేదని రోగులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో వసతుల లేమితో ఇబ్బందులు పడుతున్నామని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రారంభించిన మెడికల్ కళాశాలలో ప్రభుత్వ ఆసుపత్రిని మార్చారు. పాత ఆస్పత్రిలోనే అన్ని వసతులు ఉన్నాయని, ప్రస్తుతం కొత్తగా నిర్మించిన ఎలాంటి వసతులు లేవన్నారు. పట్టణంలో ఉన్న ఆసుపత్రిని కొత్త భవనాలలోకి మార్చారని తప్ప.. అక్కడ రోగులకు కావలసిన సౌకర్యాలను కల్పించలేకపోయారని విమర్శలు బలంగా ఉన్నాయి. పేరుకు పెద్ద ఆసుపత్రి కావడం వల్ల చుట్టుపక్కల ప్రాంతాల వారు ఇక్కడికి వస్తున్నారు. కానీ ఇక్కడ చూస్తే ఎలాంటి వసతులు లేవని రోగులు పేర్కొంటున్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలోని ఉన్నతాధికారులు వీటిపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని, వారు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ఆసుపత్రికి వచ్చి వెళ్తున్నారే తప్ప మౌలిక వసతులపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని రోగులు ఆరోపిస్తున్నారు. గత ప్రభుత్వంలో ఆసుపత్రి అయితే నిర్మించారు.. కానీ వసతులు కల్పించలేదని, కనీసం ఇప్పటి ప్రభుత్వమైన పులివెందుల ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించాలని రోగులు కోరుతున్నారు.

మ్యాచింగ్ గ్రాంట్ విడుదల చేయాలి

- పిసిసి మీడియా చైర్మన్ ఎన్.తులసిరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

కడప-రాయచోటి-మదనపల్లె నూతన బ్రాడ్‌గేజ్ రైలు మార్గ నిర్మాణానికి వెంటనే మ్యాచింగ్ గ్రాంట్ నిధులు విడుదల చేసి పనులు పునఃప్రారంభించాలని పిసిసి మీడియా చైర్మన్ ఎన్.తులసిరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. స్థానికంగా బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాయలసీమ రైతులు, వినియోగదారులు, అన్నివర్గాల ప్రజల సమగ్రాభివృద్ధికి 2008-09 రైల్వే బడ్జెట్‌లో నాటి కాంగ్రెస్ ప్రభుత్వం కడప-రాయచోటి-మదనపల్లి-బెంగుళూరు నూతన బ్రాడ్‌గేజ్ రైలు మార్గాన్ని మంజూరు చేసిందన్నారు. 2008-09 నాటి రేట్ల ప్రకారం అంచనా వ్యయం రూ.3038 కోట్లు అన్నారు. 50 శాతం నిధులు కేంద్రం, 50 శాతం నిధులు రాష్ట్రం భరించే షరతుతో మంజూరైందన్నారు. 2010 సెప్టెంబర్‌లో నాటి రైల్వేశాఖ మంత్రి మునియప్ప శంకుస్థాపన చేశారని చెప్పారు. 4 దశల్లో పూర్తి అయ్యే విధంగా రూపకల్పన జరిగిందని చెప్పారు. మొదటి దశ కడప నుంచి పెండ్లిమర్రి వరకు, రెండవ దశ పెండ్లిమర్రి నుంచి లక్కిరెడ్డిపల్లి, రాయచోటి, వాయల్పాడు మీదుగా మదనపల్లి వరకు, 3వ దశ మదనపల్లి నుండి ఆంధ్రప్రదేశ్ సరిహద్దులోని ముల్బాగల్ వరకు పనులు చేయాలని చెప్పారు. అలాగే 4వ దశ ముల్బాగల్ నుండి కోలార్ వరకు పని చేయాల్సి ఉందని తెలిపారు. మొదటి దశ కడప నుంచి పెండ్లిమర్రి వరకు 21.80 కిలోమీటర్లు పూర్తయిందన్నారు. రూ.351 కోట్లు ఖర్చు అయ్యిందని తెలిపారు. రాష్ట్ర వాటాగా రూ.132.39 కోట్లు విడుదల చేశారన్నారు. 2019లో రాష్ట్రంలో జగన్ ముఖ్యమంత్రిగా అధికారంలోకి వచ్చాక మ్యాచింగ్ గ్రాంట్ నిధులు విడుదల చేయని కారణంగా రైల్వే శాఖ పనులు నిలిపేసిందన్నారు. దీనికి తోడు పుండు మీద కారం చల్లినట్లు బెంగళూరు రైలు మార్గం వద్దని చెప్పారన్నారు. దీనికి బదులుగా 72 కిలోమీటర్ల పొడవు కలిగిన ముద్దనూరు-పులివెందుల-ముదిగుబ్బ రైలు మార్గాన్ని మంజూరు చేయాలని 2021 జూన్ 17న జగన్ కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాశారన్నారు. చంద్రబాబు ప్రభుత్వం వెంటనే మ్యాచింగ్ గ్రాంట్ నిధులు విడుదల చేసి పనులు పునఃప్రారంభించాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేస్తోందన్నారు. పనులు త్వరగా పునఃప్రారంభం కాకపోతే ఎపిసిసి అధ్యక్షురాలు వైఎస్ షర్మిలా నేతృత్వంలో వామపక్ష పార్టీలను, ప్రజా సంఘాలను కలుపుకొని కాంగ్రెస్ పార్టీ పెద్ద ఎత్తున ఉద్యమిస్తుందని తులసిరెడ్డి చెప్పారు.

అంధత్వంలేని సమాజం కోసం కృషి చేద్దాం



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

అంధత్వం లేని సమాజం కోసం అందరం కృషి చేద్దామని శాసనమండలి సభ్యుడు భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి పిలుపునిచ్చారు. పట్టణంలోని ఎంపీడీవో సభ భవనంలో బుధవారం జరిగిన జాతీయ నేత్రదాన పక్షోత్సవాలు సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ చనిపోయిన తర్వాత ప్రతి మనిషి తన నేత్రాలను దానం చేస్తే అవి మరో ఇద్దరికి చూపునిస్తాయని, దీనిని ప్రతి ఒక్కరూ అలవాటుగా మలుచుకుంటే అంధత్వం లేని సమాజాన్ని మనం చూడవచ్చు అన్నారు. ప్రతి కుటుంబం నేత్ర దానానికి ముందుకు రావాలన్నారు. స్నేహిత అమృత హస్తం సేవా సమితి ఆధ్వర్యంలో జరుగుతున్న అనేక కార్యక్రమాలకు ప్రతి ఒక్కరూ చేయూతనివ్వాలని సూచించారు. మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ మాట్లాడుతూ ఇప్పటికే పులివెందుల ప్రాంతంలో జరిగిన నేత్రధానాల వల్ల ఎంతో మంది అంధులకు చూపునిచ్చారన్నారు. డాక్టర్ రవీంద్రనాథ్‌రెడ్డి మాట్లాడుతూ నేత్రదానంలో ఎలాంటి అపోహలు పెట్టుకోవద్దని సూచించారు. నేత్రాలను దానం చేయడం వల్ల మరో చూపులేని వ్యక్తి కుటుంబానికి చూపునివ్వడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో స్నేహిత అమృత హస్తం సేవా సమితి అధ్యక్షులు రాజు, కాంగ్రెస్ పార్టీ నాయకులు వేలూరు శ్రీనివాసరెడ్డి, మాజీ మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ సర్వోత్తమ్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) : నేత్రదానం మనందరికీ ఆదర్శం కావాలని డాక్టర్ ఎ.మహాలక్ష్మి తెలిపారు. బుధవారం జాతీయ అంధత్వ నివారణ, దృష్టి లోప నివారణ కార్యక్రమంలో జరుగుతున్న జాతీయ నేత్ర దాన పక్షోత్సవాలు సందర్భంగా మండలంలోని కామనూరు పీహెచ్‌సీ పరిధిలోని ఈశ్వరరెడ్డినగర్, పెన్నానగర్, సుబ్బారావు కొట్టాలలో కల్లూరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ మహాలక్ష్మి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అప్తాల్మిక్ ఆఫీసర్ తేజ, సూపర్ వైజర్ బిఎ వరప్రసాద్, హెల్త్ అసిస్టెంట్ సుబ్బయ్య, సీహెచ్‌ఓ గంగ తులసి, ఎఎన్ఎం గాయత్రి, ఆశాలు కరుణామణి, చెంచమ్మ, సాలమ్మ, శ్రీదేవి, వరలక్ష్మి, భాగ్యమ్మ,శివజ్యోతి స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

వంతెన నిర్మాణ వెడల్పు పెంచాలని ఆందోళన

ప్రజాశక్తి - మైదుకూరు



మైదుకూరు పట్టణ సమీపంలో గ్రీన్ ఫీల్డ్ హైవే కోసం నూతనంగా నిర్మిస్తున్న వంతెన నిర్మాణాన్ని వెడల్పు పెంచాలని బుధవారం ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన చేపట్టారు. కొత్తగా నిర్మిస్తున్న నూతన బైపాస్ దగ్గర చిన్నగా వంతెన నిర్మించడం సరైన పద్ధతి కాదని హెచ్చరించారు. ఈ వంతెన నుంచి కనీసం ఆటోలు కూడా వెళ్లేందుకు అవకాశం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. 20 గ్రామాల ప్రజలు ఈ వంతెన ద్వారా రాకపోకలు కొనసాగించాల్సిన అవసరం ఉందన్నారు. బస్సులు వెళ్లేం దుకు అణువుగా కాంట్రాక్టర్లు వెంటనే డిజైన్ మార్చి వంతెనను విశాలంగా నిర్మించాలని కోరారు.

క్రీడల్లో రాణించి గుర్తింపు పొందాలి

వేంపల్లె : విద్యతోపాటు క్రీడల్లో కూడా రాణించి గుర్తింపు పొందాలని ఎంపిడిఒ సంపతి దివిజా కోరారు. బుధవారం స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఆట స్థలంలో జిల్లాస్థాయి టెన్నికాయిట్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీలను ఎంపిడిఒ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాస్థాయిలో ప్రతిభ చూపిన విద్యార్థులకు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనేందుకు అవకాశం ఉంటుందని చెప్పారు. క్రీడలు ఆడే సమయంలో స్నేహాభావంతో మెలగాలన్నారు. విద్యార్థులు టెన్నికాయిట్ ఆడేందుకు శాశ్వత కోర్టును ఆటస్థలంలో ఏర్పాటు చేయాలని పాఠశాల ఫిజికల్ డైరెక్టర్‌ను కోరారు. కార్యక్రమంలో టెన్నికాయిట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రవికుమార్, టెన్నికాయిట్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి స్టాలిన్, పాఠశాల హెచ్‌ఎం శివ మునెమ్మ, ఫిజికల్ డైరెక్టర్లు రాజశేఖర్, జయప్రద, పాఠశాల చైర్మన్ బుజ్జీ, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలకు అలవాటు పడొద్దు

ప్రజాశక్తి - వేంపల్లె

విద్యార్థులు మాదక ద్రవ్యాలకు అలవాటు పడొద్దని ట్రిపుల్‌ఐటి డైరెక్టర్ కుమార స్వామి గుప్తా, పరిపాలన అధికారి డాక్టర్ పెనుగొండ రవికుమార్ సూచించారు. బుధవారం ఇడుపులపాయి ట్రిపుల్ ఐటి క్యాంపస్‌లో మాదకద్రవ్యాల నిషేధంపై ఎన్ఎస్ఎస్ యూనిట్-9 ప్రోగ్రాం అధికారి బొజ్జా అనిల్ కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇంజనీరింగ్ విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. క్యాంపస్‌లో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు డ్రగ్స్‌ను వాడితే భవిష్యత్తు నాశనం అవుతుందని వివరించారు. విద్యార్థి దశలోనే తప్పు చేస్తే దాని పరిణామం తల్లిదండ్రులపై పడుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ మధుసూధన్‌రెడ్డి, ప్రోగ్రాం ఆఫీసర్లు ఇందుమతి, సుబ్బరాయుడు, గోవర్ధన్, క్యాంపస్ కో-ఆర్డినేటర్ అనిల్ కుమార్ రెడ్డి, డీన్ అకడమిక్స్ డాక్టర్ రత్నకుమారి పాల్గొన్నారు.



ఎస్ఎఫ్ఐ పట్టణ నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

స్థానిక ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో బుధవారం పట్టణ నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఎద్దు రాహుల్ ఆధ్వర్యంలో 11 మందితో ఏర్పాటు చేశారు. పట్టణ నూతన అధ్యక్ష,కార్యదర్శులుగా సునీల్, శ్రావణ్‌ను ఎన్నుకున్నారు. ఈ సంద ర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రాహుల్ మాట్లాడుతూ భారత విద్యార్థి ఫెడరేషన్ విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడం కోసం నిరంతరం పోరాడుతుందన్నారు. అధ్యయనం, పోరాటం, చదువుతూ పోరాడు.. చదువుకోసం పోరాడు అనే అంశంతో ముందుకు సాగుతుందన్నారు. కడప జిల్లాలో అనేక విద్యారంగ సమస్యలు ఉన్నాయని, వాటి పరిష్కారం కోసం కృషి చేయాలన్నారు. రాబోవు రోజుల్లో ప్రొద్దుటూరు పట్టణంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కార కోసం చేసే పోరాటానికి సంసిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. నూతన కమిటీ సభ్యులుగా ఎస్ఎఫ్ఐ ఉపాధ్యక్షులు ప్రసాద్, గణేష్, సహాయ కార్యదర్శులుగా యోగేష్, అభినయ్, కమిటీ సభ్యులుగా 5 మందిని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు సురేష్, డివైఎఫ్ఐ నాయకులు విశ్వనాథ్ పాల్గొన్నారు.

శిశు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ప్రజాశక్తి - చక్రాయపేట

శిశు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని సురభి, కుప్పం సెక్టర్ సూపర్‌వైజర్ సుభద్రమ్మ, చక్రాయపేట సెక్టార్ సూపర్ వైజర్ నాగసుభాషిని పేర్కొన్నారు. పౌష్టికాహార మాసోత్సవాలను పునస్కరించుకుని బుధవారం అద్దాలమర్రి, చెరుకొంపల్లి, కుమార్‌కాల్వ దళితవాడ, కుమార్ కాల్వ మెయిన్, సురభి గ్రామం బాల తిమ్మయ్యగారి పల్లెలో ఆయా టీచర్ల ఆధ్వర్యంలో పౌష్టికాహార మాసోత్సవాలను నిర్వహించారు. ముఖ్యఅతిథిగా సూపర్‌వైజర్లు మాట్లాడుతూ మహిళలు, బాలింతలు, గర్భిణులు, పిల్లలు రక్త హీనతకు గురికాకుండా పౌష్టికాహారాన్ని తీసుకోవాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో శిశు సంక్షేమ మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు మాసోత్సవాలను ప్రతి గ్రామంలో నిర్వహించి, సమతుల్య ఆహారం పట్ల ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆయా అంగన్వాడీ సిబ్బంది, గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లల తల్లులు, ప్రజలు పాల్గొన్నారు.

చాపాడు : గర్భిణులు, బాలింతలు క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవాలని ఐసిడిఎస్ సూపర్వైజర్లు రాజ్యలక్ష్మి, సుబ్బరత్నమ్మ తెలిపారు. బుధవారం పోషక వారోత్సవాలలో భాగంగా మండల పరిధిలోని అల్లాడుపల్లె, చాపాడు సెక్టార్లలో సమావేశాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోషక విలువలు ఉన్న పప్పు దినుసులు, ఆకుకూరలు, కూరగాయలు క్రమం తప్పకుండా తీసుకోవాలన్నారు. కడప డివికె న్యాయవాదులు పర్వీన్, సునీత మాట్లాడుతూ మహిళలు గృహహింస చట్టాలను తెలుసుకోవాలన్నారు. బాల్యవివాహాల వల్ల కలిగే నష్టాలను వివరించారు. కార్యక్రమంలో ఖాదర్‌పల్లె సర్పంచ్ భర్త జైనుల్లా, జిఎంఎస్ కె ప్రసన్న, అంగన్వాడీ టీచర్లు భారతీదేవి, వెంకటసుబ్బమ్మ, వరలక్ష్మి, సుజాత పాల్గొన్నారు.

ఖాజీపేట : ప్రతి ఒక్కరూ పౌష్టికాహారాన్ని తప్పక తీసుకోవాలని, తద్వారా రక్తహీనతను నివారించవచ్చని స్త్రీ శిశు సంక్షేమ శాఖ సూపర్వైజర్లు పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని తుడమలదిన్నె, ఖాజీపేట-1 అంగన్వాడీ కేంద్రాల్లో పోషకాహార మాసోత్సవం సందర్భంగా గర్భిణులు, బాలింతలకు పోషకాహార లోప సమస్యతోపాటు రక్తహీనత గురించి వివరించారు. ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు తప్పక తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అంగనవాడీ సూపర్వైజర్లు భారతి, రమాదేవి, శ్రీదేవి, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

సింహాద్రిపురం : పోషకాహారం తీసుకోవడం వల్ల సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని ఎంపీడీవో కృష్ణమూర్తి పేర్కొన్నారు. సింహాద్రిపురం ఇందిరానగర్ అంగన్వాడీ సెంటర్లో పోషకాహార మాసోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ వసంత, వైద్య సిబ్బంది, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎరువుల కొరత లేదు : ఎఒ

మైదుకూరు : ఖరీఫ్ సీజన్‌లో రైతులకు అవసరమైన ఎరువులకు కొరత లేదని మండల వ్యవసాయాధికారి ప్రసన్న బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. యూరియా, డిఎపి వైట్ పొటాష్ అన్నలూరు, శివపురం, నంద్యాలంపేట, ఆదిరెడ్డిపల్లి, వనిపెంట, గంజికుంట గ్రామాల రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఖరీఫ్ పంటలను త్వరితగతిన నమోదును చేసుకోవాల్సిందిగా తెలిపారు.

వరద బాధితుల సహాయార్థం తరలిరండి

ప్రజాశక్తి- ముద్దనూరు

వరద బాధితుల సహాయార్థం నియోజకవర్గ ప్రజలు, కూటమి నాయకులు, కార్యకర్తలు స్వచ్ఛందంగా తరలి రావాలని బుధవారం ముద్దనూరు మండల కూటమి నాయకులు డాక్టర్ కటికరెడ్డి మధుసూదనరెడ్డి పిలుపునిచ్చారు. విజయవాడ వరద బాధితులకు సహాయం చేసేందుకు జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి ఆధ్వర్యంలో ఈనెల 5నుండి 7వ తేదీ వరకు చేయూత నిచ్చేందుకు తరలి రావాలని కోరారు. దాతలు వారి సొంత ఖర్చులు, వాహనాల్లో వచ్చి భాదితులకు సహాయం చేసి ఆదుకోవాలని కోరారు.

IN THE COURT OF THE Prl. DISTRICT JUDGE: (MACT), KADAPA.

M.V.O.P.No.187/2023

1. K.Subbarayudu
2. K.Thimmulamma
3. K.Jyothi

All are resident of D.No.1-179, Thappeta Obayapalli village, Chapadu Mandal, Kadapa District. ...Petitioners

Vs

1. A.Subbamma (R1)
2. Chola MS General Insurance Company Limited. (R2). Rep by its Manager, Chennai.
3. A.Penchalaiah (R3)

Both R1& R3 are Resident of D.No.7/20-B, KothaGandhi Nagar Village, Mydukur Mandal, Kadapa District.

...Respondents

SUMMONS TO THE RESPONDENTS NO. R1 AND R3

That the above suit is filed by the petitioner for Claiming Compensation amount and the matter is posted on 4-9-2024. for your appearance Please take notice and appear on 13/9/2024 at 10.30 A.M. in the above court, either in person or through an advocate failing which the matter will be decided exparte.

//By Order of the Hon'ble Court//

U.SESHAIAH

Advocate for Petitioners, KADAPA.

మహారాజశ్రీ గౌరవనీయులైన సీనియర్ సివిల్ జడ్జి కోర్టు, ప్రొద్దుటూరు.

E.P.No. 13/2023

O.S.No. 52/2018

మద్దిక నాగమునిరెడ్డి. ...పిటిషనర్/వాది

Vs

నాగిరెడ్డి పద్మనాభరెడ్డి, తండ్రి వెంకటేశ్వరరెడ్డి, డోర్‌నెం.2/568, మేడపైన బాలాజినగర్, ప్రొద్దుటూరు టౌన్ మండలం, కడప జిల్లా. ...రెస్పాండెంట్/ప్రతివాది

పబ్లిక్ ప్రకటన

ఇందుమూలంగా ప్రతివాదికి తెలియజేయటం ఏమనగా వాది ప్రతివాదికి రూ.5,00,000/- డబ్బు ఇచ్చి సదరు రూపాయలకు ప్రతివాది, వాది పేరు మీద 27.12.2014 ప్రోనోటు వ్రాయించి ఇచ్చినాడు. సదరు ప్రోనోటు బాపతు రూపాయలు వాదికి ప్రతివాది ఇవ్వనందున, సదరు బాండు బాపతు డబ్బు రాబట్టుకొనుటకు వాది ప్రతివాదిపైన పై కోర్టు నందు దావా వేయగా సదరు కేసు ఓ.యస్.నెం.52/2018గా నమోదు అయి విచారణ జరిగి 10.09.2018వ తేదీన రాజశ్రీ పై కోర్టు వారు వాదికి అనుకూలంగా డిక్రీ ఇవ్వడం జరిగినది. వాది సదరు డిక్రీ దాఖలా రూపాయలు రాబట్టుకొనుటకు ప్రతివాదిపైన పై కోర్టు నందు E.P. దాఖలు చేసియున్నారు. సదరు కేసు E.P.No. 13/2023గా నమోదు అయి ఆర్డరు 21 రూలు 22 సి.పి.సి ప్రకారం ప్రతివాదికి కోర్టు ద్వారా అనేక పర్యాయములు నోటీసులు పంపడమైనది. సదరు కోర్టు నోటీసులు ప్రతివాదికి చేరనందున రాజశ్రీ పై కోర్టు వారు ప్రజాశక్తి దినపత్రిక ద్వారా నోటీసును ప్రతివాదికి తెలియజేయమని ఆర్డరు వేసియున్నారు. రాజశ్రీ కోర్టు వారి ఆర్డరు ప్రకారం ఈ ప్రకటన ఇవ్వడమైనది.పై కేసు పై కోర్టు నందు 4.10.2024వ తేదీన విచారణకు యున్నది. సదరు తేదీన పై కోర్టుకు ఉదయం 10.30 గంటలకు ప్రతివాది గాని లేక అతని తరపున న్యాయవాది గాని హాజరు కావలసినది. అట్లు ప్రతివాది హాజరు కాని యెడల ప్రతివాది పరోక్షమునందు కేసు తీర్మానించంబడును.

పి.రాజేష్ కుమార్ రెడ్డి

వాది తరపు న్యాయవాది,

సెల్: 9346362201.

IN THE COURT OF THE HON'BLE PRINCIPAL DISTRICT JUDGE : KADAPA

G.O.P. No. 41/2024

(In the matter of permission to sell the property of minors viz. (Mogal Alisha Baig, aged 12 years and 2) Mogal Alfiya Baig, aged 4 years).

(1) Mogal Alisha Baig, D/o. Mogal Kalesha Baig, aged 12 years, Minor, Muslim (Aadhar No. 9902-0227-3130).

(2) Mogal Alfiya Baig, D/o. Mogal Kalesha Baig, aged 4 years, Minor, Muslim, (Aadhar No. 8873-7365-4829).

Both are Minors, represented by their natural and guardian father Mogal Kalesha Baig, S/o. Late Mogal Usman Ali Baig, Muslim, aged 49 years, residing at D.No. 37/765 Upstairs, Nehru Nagar, Chinna Chowk, Kadapa city & District (Aadhar No. 4657-4834-8799 & Cell: 7093764926).

జనరల్ పబ్లిక్ నోటీసు

పై నెంబరు పిటీషన్‌లోని మైనర్లు లేట్ మొగల్ గౌషియా బేగం మరియు మొగల్ కాలేషా బేగ్ గార్ల సంతానము. షెడ్యూలు దాఖలా ఆస్థిని మొగల్ గౌషియా బేగం గారు 29.08.2019వ తేదీన విక్రయ దస్తావేజు నెం. 6773/2019 గా కొనుగోలు చేసినారు. తరువాత ఈమె 28.04.2021వ తేదీన చనిపోయినది. మొగల్ గౌషియా బేగం గారికి వారసులుగా భర్త మొగల్ కాలేషా బేగ్, ఇద్దరు కుమార్తెలు అనగా మొగల్ అలీషా బేగ్ మరియు మొగల్ అల్ఫియా బేగ్. ఇద్దరు కుమార్తెలు మైనర్లు. వీరిద్దరు వారి తండ్రి అయిన మొగల్ కాలేషా బేగ్ సంరక్షణలో వున్నారు. 1వ మైనరు పిటీషనరు 7వతరగతి చదువుతున్నది మరియు 2వ మైనరు పిటీషరు 4 సం॥ల వయస్సు గల చిన్నపాప. 1వ మైనరు పిటీషనరు చదువులకోసము 2వ పిటీషనరు. పోషణ కొరకు మరియు కుటుంబ అవసరాలకు గానూ మైనరు పిటీషనర్ల యొక్క తండ్రి అయిన మొగల్ కాలేషా బేగ్ షెడ్యూలు దాఖలా ఆస్థిని అమ్మదలచి అందుకు గానూ మొగల్ కాలేషా బేగ్ గారిని గార్డియన్ గా సదరు మైనర్లు వాటాకు సంబంధించిన షెడ్యూలు ఆస్థిని విక్రయించుటకు అనుమతి కోరుచూ రాజశ్రీ ప్రధాన జిల్లా జడ్జి కోర్టు వారిని ఉత్తర్వులు ఇవ్వవలసినదిగా పై జి.ఒ.పి. నెంబరు 41/2024 దాఖలు చేయడమైనది.. కావున సదరు విషయములో ఎవ్వరికైననూ ఎలాంటి ఆక్షేపణలు వున్నయెడల రాజశ్రీ ప్రధాన జిల్లా జడ్జి కోర్టులో 24.09.2024వ తేదీన ఉదయం 10-30 గం?లకు స్వయముగా కానీ, వకీలు ద్వారా గానీ రాజశ్రీ కోర్టుకు వచ్చి మనవి చేసుకోవలసినదిగా యిందుమూల ముగా తెలియజేయడమైనది.

SCHEDULE

Kadapa District, Kadapa Urban Sub-District, Kadapa Municipal Corporation area, Chinna chowk illaqa, 2nd ward, Present Corporation Ward No.37 of Nehru Nagar in Door No. 2/765-1-1, Door No. 2/765-1-2, present Corporation issued Door No. 37/765-1-1, Assessment No. 1013037196, Door No. 37/765-1-2, Assessment No. 1013037201 of R.C.C. Mahadi Midde House, vacant site of Chinna Chowk Village fields in Sarkar Punji D.No. 147/1 an extent Ac. 0.91 cents pyki Ac. 0.03 cents, pyki Ac. 0.01, 1/2 cents or 0.006 hectors of site. In this site, the above mentioned RCC Mahadi House, vacant site, with the following boundaries:-

East: Others house., West: Road., North: Road., South: House of Shaik Badesaheba and joint wall.

Admeasuring:-

East-west 36 links or 7.32 meters., North-south 42 links or 7.32 meters., Measurements of an extent of Ac. 72.6 Sq. yards of site. In this site, the above mentioned RCC Ground Floor House measurements, East-west 22 feet or 6.71 meters., North-south 26 feet or 7 93 meters., Measurements of 572 Sq. feet of RCC Ground Floor Midde House. In this House upstairs Mahadi Midde House measurements, East-west 22 feet or 6.71 meters, North-south 26 feet or 7.93 meters measurements of 572 Sq. feet of R.C.C. Mahadi Midde House with all easementary rights sold.

//By Order of the Court//

సయ్యద్ ముస్తాక్ అహమ్మద్

అడ్వకేట్, కడప.

మహారాజశ్రీ ప్రధాన జిల్లా జడ్జి గారి కోర్టులో, కడప

G.O.P.No. 38/2024

(ఇబ్రహిం యహ్యాఖాన్, నియాజీ, మైనర్, వయస్సు 18 సం॥ లు, అయినందున అతని వాటాను కోర్టు పర్మిషన్‌తో ఇతరులకు అమ్మివేయుటకు)

ఇబ్రహిం యహ్యా ఖాన్ నియాజీ, తండ్రి కడప న్యాజి సాదిత్ అలిఖాన్, వయస్సు 18 సం॥లు, మైనర్, ముస్లిం కులం, అతని తల్లి అయిన సంరక్షణకర్త జనక తల్లి శ్రీమతి నియాజీ తనిజమ్ కౌసర్ భర్త కడప నియాజీ సాదిత్, అలిఖాన్, డోర్‌నెం.49/80-ఎ, రవీంద్రనగర్, కడప. ఆధార్ నెం.8172 1418059, సెల్ నెం.96322 03160.

...పిటీషనర్లు

Vs

నిల్. ...రెస్పాండెంట్

పబ్లిక్ నోటీసు

పై కనీన నా కక్షిదారులు తన భర్త మరణించినందున ఆమె కుమారుడు అయిన ఇబ్రహిం యాహ్యాఖాన్ నియాజీ మైనర్ అయినందున అతని వాటా క్రింద కనిన ఆస్థిని ఇతరులకు అమ్మివేయుటకు మరియు వచ్చిన భాగంను కోర్టు వారి సివిల్ కోర్టు డిపాజిట్ నందు ఫిక్స్‌డ్ చేయుటకు యెవరికైనను అభ్యంతరములు వున్నచో వారు పై కనీన కోర్టులో తేది: 09.09.2024న ఉదయం 10.30 గంటలకు హాజరు అయి అభ్యంతరములు తెలుపుకొనవచ్చును. అలా ఎవరికైనను అభ్యంతరములు తెలుపుకోనంతట కోర్టు వారు మైనర్ పిటీషనరు సంరక్షణ కర్త జనక తల్లి అయిన శ్రీమతి నియాజీ తనిజిమ్ కౌసర్ గారికి క్రింద కనీన షెడ్యూలు ఆస్థిని ఇతరులకు అమ్మివేయుటకు అనుమతికి ఉత్తర్వులు పొందుతారని ఇందుమూలకంగా తెలియజేయపరచడమైనది.

షెడ్యూలు

కడప డి.కడప సబ్ డి.కడప టౌన్, మున్సిపల్ ఏరియాకు చేరిన కడప టౌన్, 20 వార్డుకు చేరిన కో-ఆపరేటివ్ కాలనీ ఏరియాలోని, బెల్లం సిద్ధారెడ్డివీధిలోని ప్రస్తుత మున్సిపల్ డోర్ నెం.20/967 రు గల ఆర్.సి.సి. స్లాబ్ మహడిమిద్దె ఇల్లు, బిడువు జాగా వగైరాలు:- చిన్నచౌకు గ్రామం పొలంలో:-

సర్కారు పుంజి డి.నెం.954/1బి ఏ.1.06 సెంట్లు ఈ పైకి య.0.07 1/2 సెంట్లు లేక 0.030 హెక్టర్లు గల జాగాలో నిర్మించిన పై తెలిపిన డోర్ నెంబరు గల ఆర్.సి.సి.స్లాబ్ మహడీ మిద్దె ఇల్లు, బిడువు జాగా, వగైరాలకు చెక్కు బంది వివరం, తూర్పు: పోలీసు గౌస్‌మొహిద్దీన్ గారి ఇల్లు, పడమర : పబ్లిక్ రోడ్డు, ఉత్తరము కమలకర్ రావు ఇల్లు, పడమర : పబ్లిక్ రోడ్డు, ఉత్తరము : కమలకర్ రావు తాలూకా ఇల్లు, దక్షిణం: పబ్లిక్ రోడ్డు ఈ లోగా తూర్పు: పడమర: 60 అడుగులు, లేక 18.28 మీటర్లు, ఉత్తరం, దక్షిణం (ఉత్తరం కంపౌండు గోడతో కలిపి): 54 అడుగుల లేక 16.45 మీటర్లు కొలతలు గల జాగా యున్న ఈ జాగాలో తూర్పు, పడమర, ఉత్తర దిశన : 35 అడుగులు లేక 10.67 మీటర్లు తూర్పు: పడమర: దక్షిణం దిశ: 38 అడుగులు లేక 11.59 మీటర్లు, ఉత్తర : దక్షిణం: ఇరువైపుల 40 అడుగులు లేక 12.20 మీటర్లు కొలతల గల స్లాబ్ మిద్దె ఇల్లున్న, ఈ స్లాబ్ మిద్దె ఇంటికి పడమర దిశ. వుండు మిద్దె ఇంటికి కొలతలు: తూర్పు, పడమర, ఉత్తర దిశన: 17 అడుగులు లేక 5.18 మీటర్లు, తూర్పు: పడమర, దక్షిణం దిశన: 12.9 అడుగులు లేక 3.93 మీటర్లు, ఉత్తర-దక్షిణం: ఇరువైపుల 28.3 అడుగుల లేక 8.63 మీటర్లు కొలతల గల స్లాబ్ మిద్దె యిల్లున్న, ఈ స్లాబ్ మిద్దె ఇంటి పైన ఫస్ట్ ఫ్లోర్‌తో గల ఆర్.సి.సి.స్లాబ్ మిద్దె ఇంటికి కొలతలు: తూర్పు: పడమర: ఇరువైపుల 35.6 అడుగులు లేక 10.85 మీటర్లు, ఉత్తర, దక్షిణం ఇరువైపుల గల స్లాబ్ మహడిమిద్దె ఇల్లున్న, ఈ స్లాబ్ మహడి మిద్దెకు పడమర దిశన వున్న ఆర్.సి.సి. స్లాబ్ రూముకు కొలతలు: తూర్పు, పడమర 9 అడుగులు, లేక 2.74 మీటర్లు, ఉత్తర: దక్షిణం: 9 అడుగులు లేక 2.74 మీటర్లు, కొలతలు గల స్లాబ్ రూమున్న, పై తెలిపిన క్రింది స్లాబ్ మిద్దె ఇంటికిని మహడి ఇంటికని సంబంధించిన యావత్తు అడుగు జాగా, బిడుగు జాగా, తలుపుల ద్వారా భందనములు పై కప్పు క్రింది స్లాబ్ మిద్దె ఇంటిలోని హెచ్ఎస్‌సిను, 26436, 26437 ర్లు, పై స్లాబ్ మిద్దె ఇంటిలోకి మీటరు నెం.26438, 26439 ర్లు క్రింది రూములోని మీటరు నెం.61395 మీటర్లు, మీటర్లు డిపాజిట్, యావత్తు ఎలక్ట్రికల్ ఫిట్టింగ్స్, ఈ స్లాబ్ మహడీ మిద్దె పైకి పోవుటకు కట్టి వుండు తాపలతో పూరా హక్కున్న, ఈ స్లాబ్ మహడి మిద్దె ఇంటికి సంబంధించిన ఉత్తరం, దక్షిణం, పడమర దిశల యందు వుండు కంపౌండు, గోడలలో పూరా హక్కున్న ఈ స్లాబ్ మహడి మిద్దె ఇంటిలోని నీటి కుళాయి, కొళాయికి అమర్చిన నీటి మీటరు, ఈ స్లాబ్ మహడి మిద్దె ఇంటిలోని నీటి బోరు, బోరుకు అమర్చిన మీటరుతో పూరా హక్కును మరియు ఈ స్లాబ్ మహడి మిద్దె ఇంటికి సంబంధించిన యావత్తు ఈజుమెంటు హక్కులతో సహా విక్రయం, ఈ స్లాబ్ మహడి మిద్దె ఇంటికి సంబంధించిన యావత్తు ఆస్థిలో 1/2 అర్ధభాగం తూర్పు దిశన విక్రయం.

//కోర్టు వారి ఉత్తర్వుల మేరకు//

ఎమ్.సుధాకర్ బాబ్జీ

అడ్వకేట్, కడప.